# సైదులు

-గంటి భానుమతి

ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసాక గతించిన స్కూలు జీవితంలోని జ్ఞాపకాలు అప్పుడప్పుడు నన్ను చుట్టు ముట్టేసి, ఊపిరి సలపనంతగా ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. అవును మరి ముప్ఫయి మూడేళ్ల అనుభవాలు, వాటి జ్ఞాపకాలు. అయితే వాటిలో ముల్లల్లా గుచ్చుకునేవి ఉన్నాయి, గులాబీ పువ్వుల్లా సుతి మెత్తగా మనసుని తాకినవి కూడా ఉన్నాయి.

అయితే అవన్నీ ఓ ఎత్తయితే సైదులు జ్ఞాపకాలు ఓ ఎత్తు. థియరికీ, ప్రాక్టికల్స్‌కీ తేడా చూపించిన వాడు సైదులు. చెప్పేదానికి, చేసేదానికి మధ్య వున్న వైరుధ్యం, వంచనకి నగ్నరూపం. ఆ రూపం చెరిపేసేలా ఓ చక్కటి పాఠం నేనే వాడి దగ్గర నేర్చుకున్నాను.

ఆ పల్లెటూరుకి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లాక నా మొదటి క్లాసు మూడో క్లాసుకి సైన్స్ చెప్పడం. చిన్నపిల్లలు, వాళ్లకి సైన్స్ అంటే ఇష్టం కలగాలని, మన రోజువారీ జీవితంలో సైన్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో, మనం పొందుతున్న లాభాలేమిటో అవన్నీ కూడా కథల్లాగా పిల్లలకి చెబుతుంటే అందరూ శ్రద్ధగా వింటున్నారు.

హఠాత్తుగా గుమ్మం దగ్గర ఏదో శబ్దం, అలికిడి అయింది.అంతవరకూ ఎంతో ఆసక్తిగా, నిశ్శబ్దంగా ఉన్న పిల్లలు కళ్లు, తలలూ తిప్పి గుమ్మంవైపు చూడడంతో నేను కూడా గుమ్మంవైపు చూసాను.

వీపునవున్న పుస్తకాల సంచీ బరువుకి భుజాలు రెండు బాగా ముందుకు వంచేసి తల వంచుకుని ఉన్న ఓ సన్నటి పిల్లాడు నుంచుని ఉన్నాడు. అణగని ఎర్ర జుట్టు ఉడతలు పీకిన టెంకలా ఉంది. చిరుగు బట్టలు, పెద్ద హవాయి చెప్పులు వాడి ఆర్థిక స్థితిని చెబుతోంది.

వాడి ఆలస్యానికి కారణం ఏమైనా అయి ఉండవచ్చు. బియ్యం లేకపోవచ్చు, కొట్టు తెరిచాక బియ్యం కొని వాళ్లమ్మ అన్నం వండాక తిని వచ్చి ఉండవచ్చు. వీధి చివర్న ఉన్న బోరులోంచి నీళ్లు తేవడంలో సాయం చేసి ఉండవచ్చు. ఏడుస్తున్న తమ్ముడినో, చెల్లినో ఆడిస్తూ ఉండవచ్చు. కారణం ఏదైనా కావచ్చు. అందుకని, అందరి ముందూ అడిగి ఇబ్బంది పెట్టకుండా క్లాసు అయిపోయాక వాడిని పిలిచి కారణం కనుక్కోవచ్చు అని అనుకున్నాను.

"పేరేమిటి?"

"సైదులు సార్" ఒక్కసారిగా పిల్లలంతా గట్టిగా అరిచారు.

చేత్తోనే సైగ చేసి పిల్లల్ని ఊరుకొమ్మని సైదులుకేసి చూసాను. వాడు అలాగే తలొంచుకుని ఏ మాత్రం చలనం లేకుండా ఉన్నాడు.

"సరే లోపలికి వచ్చి కూర్చో"

తలెత్తకుండా చెప్పుల్ని ఈడుస్తూ ఓ కఠోరమైన శబ్దం వస్తుంటే అటూ ఇటూ చూడకుండా ఆఖరి బెంచీలో కూర్చున్నాడు. అక్కడ ఇంకెవ్వరూ లేరు. వేరే బెంచీల్లో వాడికి సరిపడా స్థలం ఉన్నా కూడా వాడు కూర్చోలేదు. వాడు వాళ్ల పక్కన కూర్చోడం పిల్లలకి ఇష్టం లేదేమో!

ఆ రోజు సైదుల్ని విడిగా పిలిచి మాట్లాడడానికి నాకు వీలుకాలేదు. పరిచయాలు, టీచర్స్ కాపీలు తీసుకోవడం, టైమ్‌టేబుల్ రాసుకోవడం లాంటి పనులు, మిగతా క్లాసులకి వెళ్లడంలో బిజీగా ఉండిపోయాను.

కానీ అదేరోజు సాయంత్రం బాగా చీకటి పడిపోతున్న సమయంలో హెడ్ మాస్టారుగారి ఇంటికెళ్లి వస్తుంటే ఓ గుడిసె ముందు నిశ్చలంగా కూర్చున్న సైదులు కనిపించాడు. దగ్గరకెళ్లాను.

నన్ను చూడగానే వాడు తలని బాగా వంచేసాడు.

"మీ ఇల్లేనా?" అంటూ గుడిసెవైపు వేలు చూపించాను.

తల ఊపాడుకానీ తలెత్తలేదు.

"దాంట్లో ఎవరూలేరా? చీకటిగా ఉంది"

"లేరు" అని అన్నాడు. గొంతు చాలా పీలగా ఉంది.

"నాన్న..."

"రాత్రి వస్తాడు"

"అమ్మ"

ఆకాశం కేసి చూపించాడు "రాత్రి అక్కడే ఉంటుంది" ఒక్కసారిగా గొంతుకేదో అడ్డుపడింది. 'అయ్యో' అనిపించింది.

ఏం చేయాలో అర్థంకాక ఓ నిముషం అయోమయంగా వాడిని చూసి వాడి తల నిమిరి హెడ్ మాస్టార్‌గారింటికి వెళ్లాను. ఆయన వాడి గురించి చెప్పారు. రెండో కాన్పు సమయంలో సైదులు తల్లి పోయింది. తండ్రి మరో పెళ్లి చేసుకోలేదు. కానీ తాగుబోతు. వాడి ఆలనా పాలనా చూసేవాళ్లు లేరు. ఇంట్లో ప్రేమించేవాళ్లు, అభిమానించేవాళ్లు దగ్గరకు తీసుకుని లాలించేవాళ్లు లేకపోతే సైదుల్లా ఉంటారనిపించింది.

***

ఆ తరువాత నుంచి సైదుల్ని గమనించడం స్కూలు టైములో ఓ భాగం అయిపోయింది.

సైదులు ఎవరితోనూ మాట్లాడడు. పిల్లలు కూడా వాడితో మాట్లాడుతుండగా నేను చూడలేదు. వాడి దగ్గర ఎవరైనా ఉన్నారంటే వాడిని ఆటపట్టిస్తున్నారని అర్థం. ఎవరూ వాడి పక్కన కూచోరు, వాడితో మాట్లాడరు.


చిన్నపిల్లల్లో ఈ భావాలు, బేధాలు ఉండకూడదు. తరతరాల నుంచి వస్తున్న జాడ్యం నా క్లాస్‌లో ఉండకూడదు. ఒకే క్లాసులో రెండు పొరల మధ్య ఎంత అంతరం! ఈ అంటరానితనం పిల్లల మధ్య దూరాల్ని పెంచుతోంది.

అందుకే సైదులు బెరుకు బెరుకుగా ఉంటాడు. ఓ టీచరుగా వాళ్ల మధ్య దూరం తగ్గించదలచుకున్నాను. క్లాసులో దాని గురించి పిల్లలకి చెప్పాను. కానీ సక్సెస్ కాలేకపోయాను.

రాన్రాను ఇంకో విషయం కూడా గమనించాను. క్లాసులో ఏది కాకపోయినా ఏ గొడవ జరిగినా సైదులు పేరు ముందుగా వినిపిస్తుంది. ఎంత

జరిగినా, ఎవరు ఎన్ని అన్నా సైదులు నోట్లోంచి ఒక్క ముక్క కూడా వచ్చేదికాదు. తనని తాను రక్షించుకునే ప్రయత్నం వాడు ఎప్పుడూ చేసేవాడుకాదు. వాడిమీద జాలివేసి ఒక్కోసారి నేను వాడిని వెనకేసుకొచ్చేవాడిని.

"సైదులు తీస్తుంటే చూసారా! చూడలేదుకదా. చూడనప్పుడు వాడే తీసాడని ఎలా అంటారు? సైదులు మీలాంటి పిల్లాడే. మీ వయస్సు వాడే కదా. ప్రతిదానికీ వాడినే బాధ్యుడిని చేయడం మీకు భావ్యం కాదు. నేరం మోపేటప్పుడు ఋజువులుండాలి. చూపించగలగాలి" అని పిల్లలని కేకలేసేవాడిని.



పోయిన వస్తువులు పలకో, టిఫిన్ డబ్బానో, నోటు పుస్తకమో, అచ్చు పుస్తకమో అయితే, ఎక్కడో ఎప్పుడో దొరికేది. అది కూడా బాత్రూంల దగ్గరో, కాంపౌండ్ గోడనానుకుని ఉన్న మెట్ట తామర మొదళ్లలోనో, ఆఫీసు రూం కిటికీ పక్కన ఉన్న గుబురు క్రోటను మొక్కల్లోనో, స్కూలు బయటో, స్కూలు కాంపౌండ్‌లో ఉన్న వేప చెట్టు కొమ్మలోనో ఎక్కడో అక్కడ దొరికేది. అయితే అవి అక్కడికి ఎలా వెళ్లింది అన్నది చిక్కువీడని మిస్టరి. చిన్నవయితే దొరికేవి కావు. అవి డబ్బులు, పెన్సిళ్లు, బలపాలు, స్కేలు ముక్కలు. ఎలా బతుకుతాడో, ఎలా నెగ్గుకొస్తాడో అని ఎప్పుడూ అనిపిస్తూ వుంటుంది.

★★★

ఓరోజు... క్లాసులోకి వెళ్లేసరికి గొడవ గొడవగా ఉంది. పిల్లలు సైదులు చుట్టూ మూగి ఉన్నారు. నా చేతిలో ఉన్న చార్ట్‌లని టేబుల్‌మీద పెట్టి పిల్లలవైపు తిరిగానో లేదో ఓ పిల్ల నా దగ్గరకొచ్చింది. ఆమె ఏదో చెప్తోంది, ఏడుస్తోంది. మిగిలిన పిల్లల గొడవలో ఏం వినబడడంలేదు. టేబుల్‌మీద చేత్తో గట్టిగా కొట్టాను. ఒక్కసారిగా పిల్లలు నిశ్శబ్దంగా అయిపోయారు.

"ఊ... ఇప్పుడు చెప్పు..."

"నా పదిరూపాయలు పోయినాయి సార్" జాలిగా అంది.

"పది రూపాయలా? అంత డబ్బు స్కూలుకెందుకు తెచ్చావ్? అసలు డబ్బులే తేవద్దానుకదా? చెప్పిన మాటలు వినరా? చూడు ఇప్పుడేమయిందో? అయినా డబ్బు తెచ్చావు అంతవరకూ ఫర్వాలేదు. మరి తెచ్చినదానివి జాగ్రత్తగా ఉండాలికదా. ఎక్కడ పెట్టావో గుర్తుకు తెచ్చుకో. అయినా డబ్బు కదా పోతే దొరకడం కష్టమే. కనుక్కుంటానులే. నువ్వెళ్లు. నీ జాగాలో కూర్చో" అని ఆ అమ్మాయిని పంపించాను.

"ఎవరైనా భాగ్యలక్ష్మి పదిరూపాయలు చూసారా? ఎవరికైనా దొరికిందా? చూసినా, దొరికినా, తీసినా, వెంటనే భాగ్యలక్ష్మికి ఇచ్చేయండి" అని పిల్లల్ని ఉద్దేశించి అన్నాను.

పిల్లలంతా ఒక్కసారిగా "సైదులు తీసాడు సార్" అని అన్నారు.

"సైదులు తీసాడని ఎలా తెలుసు?"

"కృష్ణ చెప్పిండు సార్"

"ఏం కృష్ణా నువ్వు చూసావా?"

తలూపాడు ఆ పిల్లాడు.

"అవును సార్. చూసినా సార్. బాగ్గెం బస్తా రెండుసార్లు కిందపడ్తే సైదులు తీసి ఇచ్చిండు. అప్పుడే తీసి ఉంటడు సార్"

మళ్లీ గోల. ఒక్కసారిగా ఎక్కువమంది సైదులు వైపు నడుస్తూ పిల్లల్ని ఊరుకోమన్నాను. పిల్లలు ఊరుకోలేదు. పైగా నా వెనకాలే వచ్చారు. చుట్టూ మూగారు. వాళ్లని వెళ్లమన్నా వెళ్లలేదు. నాకు కోపం ఒక్కసారిగా వచ్చింది. నిస్సహాయంగా అందర్నీ చూస్తూ సైదులు వైపు తిరిగాను.

వాడిలో చలనం లేదు. తలొంచుకుని కూర్చున్నాడు.

నేను తీయలేదు అని తనను తాను డిఫెండ్ చేసుకోకపోవడంతో నాకు ఒళ్లు మండిపోయింది.

"ఏం సైదులూ! భాగ్యలక్ష్మి పదిరూపాయలు తీసావా?"

తలెత్తలేదు. కళ్లెత్తలేదు.

"ఆ అమ్మాయి డబ్బులిచ్చేయ్"

ఏం అనలేదు. కనీసం లేవడానికి కూడా ప్రయత్నించలేదు. వాడి నిర్లక్ష్యానికి చర్రున కోపం వచ్చింది.

"లేచి నుంచో" గట్టిగా అన్నాను. అంత గట్టిగా ఎప్పుడూ అనలేదు. అదే వాడికి ఆశ్చర్యం కలిగించి ఉండొచ్చు. అయినా వాడు నావైపు చూడకుండానే లేచి నుంచున్నాడు.

"జేబులు చూపించు"

సిగ్గుపడుతూ, మెల్లగా తడబడుతూ చిరుగు జేబుల్ని చూపించాడు.

లేదు. "బ్యాగ్"

ప్రతీ పుస్తకం బయటకు తీసి ప్రతి పేజీ తిప్పుతూ చాలా ఓర్పుగా చూపించాడు. పదిరూపాయల నోటు ఎక్కడాలేదు.

"ఊ... వీటిని లోపల పెట్టుకో" మళ్లీ ఆజ్ఞాపించాను.

ఒక్కొక్క పుస్తకం మెల్లగా సంచీలో పెట్టాడు. వాడు ఒక్క మాట కూడా మాట్లాడకుండా నేను చెప్పింది చేయడం నా అహాన్ని దెబ్బ తీసింది.

వాడిని కూర్చోమని చుట్టూ గుమిగూడిన పిల్లల్ని పొమ్మన్నాను.

పీరియడ్ వేస్ట్ అయిందన్న బాధ, నా క్లాసులో డబ్బు పోయిందన్న బాధ. బోర్డుపైన వున్న రెండు మేకులకు రెండు చార్టులు తగిలించి పిల్లల్ని ఆ బొమ్మలు వేసుకురమ్మన్నాను. గాలి, నీరు ఎలా కలుషితం అవుతాయో తెలిపే బొమ్మలు అవి. పిల్లలు కూడా ఉత్సాహంగా బొమ్మలు వేయడానికి సిద్ధపడ్డారు. ప్రతి బెంచీ దగ్గరకెళ్లి వాళ్లు వేసేవి చూస్తూ నడుస్తున్నాను. ఆఖరి బెంచీ దగ్గరకొచ్చాను.

సైదులు బెంచీమీద రెండు చేతులు వుంచి తలని మోచేతి కోణంలో దూర్చాడు. నా హృదయం కదిలిపోయింది.

ఆ స్థితిలో వాడిని చూసాక నాలోని మనిషి బయటకు వచ్చాడు. వాడు నిజంగా తీసాడో లేదో నాకు తెలీదు. అయినా వాడిని అనుమానించాను. సైకాలజీ తెలిసిన టీచర్ చేయాల్సిన పనేనా ఇది? ఎంత తప్పు చేసానో సమయం గడుస్తున్నకొద్దీ వాడిని అలా చూస్తున్నకొద్దీ తెలుస్తోంది. క్షమించరాని తప్పు చేసాను. వాడు తల్లిలేని పిల్లాడు. తండ్రి వున్న అనాథ. వాడి గురించి ఆలోచించేవాళ్లు లేరు. వాడిని ప్రేమించి ఇష్టపడేవాళ్లులేరు. నేనే కాస్త వాడికి కాస్త దగ్గరయ్యాను. ఓ చిన్న పిల్లాడు కోరుకునే ఓ పిసరంత అభిమానాన్ని చూపించిన నేనే ఓ రాక్షసుడిలా ప్రవర్తిస్తే వాడు ఎవరిని ఆశగా చూస్తాడు? మిగతా పిల్లల్లాగే నేనూ ప్రవర్తించాను. నాకూ వాళ్లకీ తేడా ఏం వుంది? వయసులో తప్ప ప్రవర్తన ఒకటే. చాలా సిగ్గేసింది. ఓ చిన్న పిల్లాడిని బట్టలు, పుస్తకాల సంచీ వెతికి దుశ్శాసన సంతతిలోకి చేరిపోయాను.


వాడి తలమీద చేయివేసి నిమరాలని, క్షమించమని అడగాలని అనిపించింది. కానీ ఆ రెండూ చేయలేకపోయాను. అక్కడే నుంచున్నాను.

"సార్! ఎవరో పిల్లాడు గట్టిగా అరిచాడు.



## ఇలియానా సంకొత్త ఆలోచన

ఈమధ్యనే ఇరవై ఒకటో యేట అడుగుపెట్టిన ఇలియానా త్వరలోనే తన సొంత వ్యాపారాన్ని ప్రారంభించబోతోందిట. ఇలియానా వాళ్ల అమ్మ స్వతహాగా ఫ్యాషన్ డైజనర్ కాబట్టి రెడీమేడ్ దుస్తుల షోరూంని ముంబాయిలో ప్రారంభిస్తోంది. హైదరాబాదులో కూడా ఇలాంటి గార్మెంట్స్ షోరూంని ఆరంభించే ఆలోచనలో వున్న ఇలియానా- దేశవ్యాప్తంగా ఇలాంటి చెయిన్ స్టోర్‌ని మొదలుపెట్టాలని ఆలోచిస్తోందిట ఇలియానా. ఐడియా బాగానే వుందికదూ... ఆల్ ది బెస్ట్ ఇలియానా!



నేను ఈ మూల నుంచి పిలుపువచ్చిన ఆ వైపుకి చూసాను.

ఏమిటన్నట్లు తల ఊపి ప్రశ్నించాను.

"దొరికినాయి సర్. బాగ్గెం పైసలు దొరికినాయి. ఈడ గూట్ల ఉండె సార్" అంటూ బోర్డుకి పక్కగా ఉన్న గోడ గూడు చూపించాడు.

దగ్గరకెళ్లాను. పదిరూపాయల నోటున్న అరచేతిని నాముందుకి చాపాడు.

క్లాసులో ఒక్కసారి నిశ్శబ్దం. భాగ్యలక్ష్మి దిగ్గునలేచి పరుగులాటి నడకతో వచ్చి నా చేతిలో వున్న నోటును చూసింది.

"అవ్... అది నాదే. పెన్సిల్ చెక్కినప్పుడు పైసల్ని గాగూట్ల పెట్టిన" సంతోషంతో తల ఊపేస్తూ అంది.

డబ్బు చూసిన పిల్లాడు, డబ్బు దొరికినందుకు భాగ్యలక్ష్మి ఉత్సాహంగా, సంతోషంగా ఉన్నారు. డబ్బు దొరికాక నా తలమీద నుంచి ఓ పెద్ద బరువు దిగింది. కానీ గుండెల్లో మోయలేని బరువు నిముష నిముషానికి పెరిగిపోతోంది.

"అస్సలు యాదికే లేదు తెల్సా. గుట్ల పెట్టిన పైసలు, ఈ పెన్సిల్ చెక్కుతూ పోయిన..." పిల్లలతో చెబుతోంది.

భాగ్యలక్ష్మి తన తప్పు ఒప్పుకున్నంత సులువుగా నా తప్పును నేను ఒప్పుకోగలనా? ధైర్యంగా చెప్పగలనా? సైదులు దగ్గరకెళ్లాను.

ఇప్పుడు వాడి తల బెంచీమీద వాల్చిలేదు. కానీ తల వంచుకుని కూచున్నాడు. ఎండిన రాగి జుట్టు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఆ జుట్టుమీద చేయి వేసాను. వాడు తలెత్తాడు. ఆ తరువాత కళ్లు ఎత్తి నావైపు చూసాడు.

ఆ కళ్లల్లో నేనూహించినట్లుగా నీళ్లులేవు. కానీ అవ్యక్త భావాలు. మరొకళ్ల కయితే ఏడ్చేసేవాళ్లు. వీడికెందుకు రాలేదు కన్నీళ్లు? వాడి కన్నీటికి విలువలేదని వాడికి తెలుసా? తెల్లటి కళ్లతో నన్ను ఓసారి చూసి తల దించుకున్నాడు.

కానీ ఆ చూపుల్లో పేరుకుపోయిన బాధ నా గుండెల్ని పరపరా కోసింది. ఏం అనాలో, ఎలా ఓదార్చాలో అర్థంకాక ఆ జుట్టును నిమిరి అక్కడినుంచి వెళ్లిపోయినా వాడి చూపులు నన్ను వెంటాడుతున్నట్లుగా అనిపించింది.

స్కూలు అయ్యేవరకు అన్యమనస్కంగానే గడిపాను. పిల్లలందరూ కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ, ఒకళ్ల భుజాలమీద మరొకళ్లు చేతులు వేసుకుంటూ ఇళ్లకి వెళ్లిపోతున్నారు.

సైదులు కాళ్లీడుస్తూ, శబ్దం చేస్తూ తల వంచుకుని ఒక్కడే వెళ్తున్నాడు. వాడు కనుమరుగయ్యేవరకూ చూసి క్లాసులోకి వచ్చి బల్లమీద చేతులు ఉంచి మోచేతి కోణంలో తల దూర్చాను అచ్చు సైదుల్లాగా వాడి కళ్లల్లోని అవ్యక్త భవాల్ని గుర్తు చేసుకుంటూ. టీచరు ట్రైనింగ్‌లో చైల్డ్ సైకాలజీ మీద చదువుకున్నాను. వాటిని పాటిస్తూ విద్యార్థుల మనోభావాలు దెబ్బ తీయకుండా ఎంతో తెలివిగా వ్యవహరించాల్సిన నేను ఇదేమిటి ఇలా చేసాను?

గురు శిష్య సంబంధాల గురించి ఎప్పుడూ మాట్లాడే నేను ఎంత హీనంగా ప్రవర్తించాను? ఓ ఆదర్శ ఉపాధ్యాయుడిని కావాలనుకున్నాను. గురు శిష్య సంబంధాలు యాంత్రికంగా ఉండకుండా ఆదర్శనంగా ఉండాలనుకున్నాను. కానీ ఓడిపోయాను. సైదులు విషయంలో పాపం చేసాను. ఏం చేస్తే నా పాప పరిహారం అవుతుంది? అసహాయంగా ఉన్న వాడిలో చైతన్యం, బెదిరే కళ్లల్లో ధైర్యం వొంగిపోతూ నడిచే వాడి కోల్పోయిన వ్యక్తిత్వం ఇచ్చి గుండె విరుచుకుంటూ నడిచే పద్ధతి ఇవ్వడం కన్నా ఉత్తమమైనది ఏదీ లేదనిపించింది.

★★★

సైదులుకి బట్టలు, జోళ్లు కొన్నాను. వాడి తండ్రిని వాలంటరీ ఆర్గనైజేషన్ వాళ్లకి అప్పచెప్పాను. వాడి తాగుడు మానిపించడం సంగతి వాళ్లే చూసుకుంటారు. జిల్లాల్లో వున్న బాలుర సంక్షేమ గృహంలో వాడిని చేర్పించాను. వాళ్లు నడిపే స్కూల్లోనే సైదులు చేరాడు.

ప్రతివారం క్రమం తప్పకుండా వాడిని చూడడానికి వెళ్లేవాడిని. తలెత్తి కళ్లల్లోకి చూస్తూ మాట్లాడ్డానికి చాలారోజులు పట్టింది. ఆ తరువాత ఓ ఏడాది మాత్రమే ఆ ఊళ్లో ఉన్నాను. వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ అవడంతో అక్కడినుంచి వెళ్లిపోయాను. నా కళ్లల్లోకి చూసి మాట్లాడుతూ మధ్యమధ్యలో సిగ్గుతో తల వొంచుకోవడం, కళ్లు దించుకోవడం నాకీ రోజువరకూ గుర్తుంది.

సైదుల్ని, తాను ఏర్పరుచుకున్న గూడులోంచి బయటకు రావడానికి సాయం చేసినా దానివల్ల వాడికన్నా నేనే ఎక్కువ లాభం పొందాను.

తెలీకుండా, చూడకుండా, నిజం తెలుసుకోకుండా ఎవర్నీ అనుమానించకూడదు, అవమానించకూడదు అని పిల్లలకి నీతులు బోధించాను. సమయం వచ్చినప్పుడు నేను ఆచరించలేకపోయాను. 'నువ్వు చెప్పేది ఆచరించి చూపించు' అన్న పాఠం సైదులు నేర్పించాడు. అది నాకు తోడుగా, నా చర్మాన్ని అంటిపెట్టుకుని ఉంది. సైదులు ఋణం నేను తీర్చుకోగలనా?

★

## వజ్రాల గని

అమెరికాలోని అర్కాన్సాస్‌లో స్టేట్‌పార్క్ డైమండ్ క్రేటర్ దగ్గర అనేక మంది వాహ్యాళిగా వెడుతుంటారుట. ఇటీవల నైకోల్ రూటర్ అనే 13 ఏళ్ల పిల్లకి 2.93 కేరట్ల వజ్రం దొరికిందిట. ఈ ఏడు అలా షికారుకి వచ్చినవాళ్లకి 332 వజ్రాలు దొరికాయిట. 1972లో ఆరంభమైన ఈ గని నుంచి ఇప్పటికి 25 వేల వజ్రాలు వాకర్లకి ఇలాగే లభించాయిట.

## 201 మీటర్ల వెడ్డింగ్ గౌన్

చైనాలోని గువాంగ్‌డాంగ్ రాష్ట్ర రాజధాని గువాంఘులో ఒక హోటల్ ముందు ఊజాన్ అనే పెళ్లికొడుకు పెళ్లికూతురు వెడ్డింగ్ గౌన్‌ను అతిథులంతా ఎలా పట్టుకుని రావాలో చెప్పాడు. మూడుమీటర్ల వెడల్పు, 201 మీటర్ల పొడవు, 100 కిలోల బరువైన ఆ వెడ్డింగ్ గౌనును వంద మీటర్ల మేరకు అతిథులు పట్టుకుని ప్రయాణించారుట.

## తిమింగలంపై స్వారి

చైనాలోని షాండోంగ్ రాష్ట్రంలోని క్వింగ్‌డాలో ఎక్వేరియంలో యాంగ్ యాంగ్ అనే నాలుగేళ్ల కుర్రాడు సియావో క్వియాంగ్ అనే ఐదేళ్ల తిమంగలంపై స్వారీని సాధన చేస్తున్నాడు. ఈ స్వారీతో చైనాలో 2008లో జరుగనున్న ఒలింపిక్స్‌లో సెయిలింగ్ ఈవెంట్స్ చూడడానికి వచ్చే ప్రేక్షకుల్ని మురిపిస్తాడట.

-తటవర్తి

